
05ATP14_05ATP14.qxd 14-03-2026 PM 10:52 Page 1



# డొమెస్టిక్ గ్యాస్ సరఫరాకు ఇబ్బందులు లేవు

- సిఎస్‌డిటి మల్లేష్‌ప్రసాద్

తాడిపత్రిఅర్బన్, మార్చి 14 ప్రభాతవార్త



మాట్లాడుతున్న సిఎస్‌డిటి మల్లేష్‌ప్రసాద్

తాడిపత్రిలో డొమెస్టిక్ గ్యాస్ సరఫరాకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేవని పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్ పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా గ్యాస్ కొరత ఉందంటూ వదంతులు వ్యాపిస్తున్న నేపథ్యంలో గ్యాస్ బుకింగ్‌లో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని త్వరలోనే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఆయన పేర్కొన్నారు. శనివారం తాడిపత్రిలో ఉన్న శ్రీకాంత్ ఇండియన్, భాస్కర్ ఇండియన్, వేదా గ్యాస్ ఏజెన్సీలను మల్లేష్‌ప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ఒక సిలిండర్ బుక్ చేసుకోవడానికి 25 రోజులు గడువు విధించిందని ప్రస్తుతం అది 30 రోజులకు,గ్రామీణ ప్రాంతాల్లో 30 రోజుల నుంచి 45 రోజులకు గ్యాస్ బుకింగ్ చేయడానికి గడువు పెంచిందన్నారు. తాడిపత్రి ప్రాంతంలో డొమెస్టిక్ గ్యాస్‌కు సంబంధించి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. కంపెనీకి చెందిన యాప్‌లో గాని, ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసిన వారికి ఓటిపి చెబితేనే గ్యాస్ డెలివరీ ఇస్తారన్నారు. గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. కమర్షియల్ సంబంధించి గ్యాస్ బుకింగ్ చేసుకోవడంలేదని త్వరలోనే ఆ వివరాలు ప్రకటిస్తామని ఆయన తెలియజేశారు.

# రంగనాథస్వామికి పంచామృతాభిషేకాలు

తాడిపత్రిరూరల్, మార్చి 14 ప్రభాతవార్త



తాడిపత్రి మండలం ఆలూరుకోనలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి శనివారం ఉదయం అర్చకులు సుబ్బారావు, రంగనాథశర్మ, ఇంద్రకుమార్‌శర్మలు పంచామృతాభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, తులసి దళాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, ఆకుపూజలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా కోనలో వెలసిన ఆంజనేయస్వామి, షిరిడిసాయిబాబా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు జలపాతాల్లో స్నానాలు చేసి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. అనంతరం భక్తులు నిత్య అన్నదాన సత్రంలో భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ ఓగేటి రంగనాయకులు, ఆలూరు గ్రామపెద్ద తిరుపాల్‌రెడ్డి, సిబ్బంది కాశీ పాల్గొన్నారు.

**నేడు కళ్యాణోత్సవం :** ఆలూరు కోన రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శేషతల్ప రంగనాథస్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారి కళ్యాణం వీక్షించి శ్రీవారి తీర్థ ప్రసాదములు స్వీకరించి అన్నప్రసాదము భుజించి రంగనాథస్వామి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ ఓగేటి రంగనాయకులు, ఆలయ ఇఒ రామాంజనేయులు తెలియచేశారు.

# ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

యాడికి, మార్చి 14 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కన్వీనర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మొదట కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేరుకుపోయిన అవినీతి అంటరానితనం అధికారమదం అసమానత్వం ఇలా ఎన్నో జబ్బులను పూర్తిగా కాకపోయినా తనవంతుగా ఎంతో కొంత నిర్మూలించాలని సమసమాజం కోసం పాటుబడాలని సుదీర్ఘ కాలంపాటు ప్రయాణమే లక్ష్యంగా పవన్‌కళ్యాణ్ జనసేన పార్టీ ప్రస్థానం మొదలుపెట్టారన్నారు. ఒక్క పదవి లేకున్నా గత పదేళ్ల ప్రయాణంలో అనేక దీర్ఘకాలిక సమస్యలపై గళమెత్తి ప్రభుత్వాలతో పోరాడి పరిష్కారాలు తీసుకొచ్చామన్నారు. అవినీతి మరక లేని నాయకుడి వెంట నడుస్తున్నందుకు మనమందరం ఎంతో గర్వించాలన్నారు. రాజకీయమనే రాక్షస క్రీడలో సామాన్యులకు సైతం గుర్తింపునిచ్చి ప్రజల్లో ఒక ప్రత్యేక గౌరవాన్ని దక్కేలా చేసిన జనసేన పార్టీ బలోపేతం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ఉపాధ్యక్షులు జకీర్ హుస్సేన్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అబ్దుల్ రహీమాన్, ప్రధాన కార్యదర్శులు పప్పు వెంకటేష్, గుండ్లశివ, మధుయాచారి, నాగభూషణం, సోమరాజేశ్, దస్తగిరి, జనసైనికులు శ్రీనివాసులు, మహేష్, మల్లికార్జున, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరులో ఎస్‌టియు ప్రథమ కార్యవర్గ సమావేశం




మాట్లాడుతున్న ఎస్‌టియు నాయకులు

అనంతపురం న్యూటౌన్, మార్చి 14 ప్రభాతవార్త

ఎస్‌టియు ప్రథమ కార్యవర్గ సమావేశం ఆదివారం గుంటూరులో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తెలియజేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం, సిపిఎస్ ఖాతాలో ఉన్నటువంటి మొత్తాలు నగదు రూపంలో చెల్లించాలని, అర్బన్ ఎంఈఓ పోస్టులు, అర్బన్ ఉప విద్యాశాఖ అధికారి పోస్ట్ మంజూరు చేయాలని తదితర డిమాండ్లపై ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదన్నపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# 24న బహిరంగ వేలం

పెద్దపప్పూరు, మార్చి 14 ప్రభాతవార్త

మండలంలోని చిన్నపప్పూరు సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీఅశ్వత్థనారాయణస్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో ఈ నెల 24వతేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో బహిరంగవేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ సుబ్రమణ్యం, ఆలయ కమిటీ చైర్మన్ శివశంకర్‌రెడ్డిలు తెలిపారు. ఇందులో భాగంగా భక్తులు స్వామివారికి సమర్పించిన బియ్యం బేడల విక్రయంకు సంబంధించి ఈ బహిరంగవేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనే వారు 10 వేల రూపాయలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని వారు తెలియచేశారు.

# ఉపాధిహామీ సామాజిక తనిఖీపై ప్రజావేదిక

- దాదాపు రూ.లక్ష రికవరీ - రూ.2.21 లక్షల పనులకు విచారణ
- ప్రజావేదికలో వివరాలు వెల్లడి




ప్రజా వేదికలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

పుట్లూరు, మార్చి 14 ప్రభాతవార్త

పుట్లూరు మండలంలో 2024 ఏప్రిల్ 1 నుండి 2025 మార్చి 31వ తేదీ వరకు జరిగిన దాదాపు 12 కోట్ల రూపాయల ఉపాధిహామీ, పంచాయతీరాజ్, హౌసింగ్ తదితర పనులపై 18వ విడత సామాజిక తనిఖీ బృందం 23 గ్రామ పంచాయతీల్లో జనవరి 19వ తేదీ నుండి ఈనెల 5వరకు క్షేత్ర స్థాయిలో పనులు తనిఖీ చేయడం జరిగింది. కాగా కొన్ని పంచాయతీల్లో పనుల్లో వ్యత్యాసం వున్న కారణంగా లక్ష రూపాయలు రికవరీ చేయాలని, 2.21 లక్షల పనులకు సంభందించి ఎపిడి విచారణ చేసి నివేదికలు పంపాలని జిల్లా అధికారులు ఆదేశించారు. ఉపాధిహామీ సామాజిక తనిఖీపై మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో శనివారం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా బాలాపురం 1056 రూపాయలు, అరకటవేముల వెయ్యి రూపాయలు, ఎస్.గూడూరు 3వేలు, తక్కళ్లపల్లి 3 వేలు, సూరేపల్లి వెయ్యి, సి.వెంగన్నపల్లి వెయ్యి, గరుగుచింతలపల్లి 4 వేలు, మడ్డిపల్లి 3 వేలు, మడుగుపల్లి 2 వేలు, కొండేపల్లి వెయ్యి, జంగంరెడ్డిపేట 3 వేలు, కందికాపుల 2 వేలు, పుట్లూరు 39,240, గాండ్లపాడు 4 వేలు, కోమటికుంట్ల వెయ్యి, చెర్లోపల్లి 2 వేలు, కుమ్మనమల వెయ్యి, దోసలేడు 3 వేలు, వెల్లుట్ల 9,950 రూపాయలను రికవరీ చేయాలని, కోమటికుంట్ల 1,26,624, చెర్లోపల్లి 11,448, కుమ్మనమల 2703, దోసలేడు 86,465, వెల్లుట్ల 10,054 రూపాయల పనులపై ఎపిడి విచారణ చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సుధాకర్‌రెడ్డి, రమేష్, శ్రీనివాసులు, పర్వేష్, ఎంపిడిఒ అలివేలమ్మ, ఎపిడి చిన్నకేశవులు, ఎస్.ఆర్.పి. భాస్కర్, డిఆర్‌పిలు భారతి, వినోద్, లక్ష్మీనారాయణమ్మ, ఎపిఒ తులసిప్రసాద్, ఈసి ఆంజనకుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు నరేంద్ర, విజయ్, నాగేంద్రరెడ్డి, వెంగలరెడ్డి, రామాంజి, ప్రహ్లద, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# నిశ్చితార్థ వేడుకకు హాజరైన కేతిరెడ్డి పెద్దారెడ్డి



వేడుకలో పాల్గొన్న పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి 14 ప్రభాతవార్త

శింగనమల మండలం కల్లుమడి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు వాల్మీకి కొండయ్య కుమార్తె నిశ్చితార్థ వేడుకకు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరయ్యారు. కల్లూరులోని ఆర్ఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన నిశ్చితార్థ వేడుకకు వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, సమన్వయకర్త శైలజానాథ్‌తో కలిసి కేతిరెడ్డి పెద్దారెడ్డి వేడుకలో పాల్గొని కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# ఘనంగా వసంతోత్సవం



హంసవాహనంపై విహరిస్తున్న లక్ష్మీవేంకటరమణస్వామి

యల్లనూరు, మార్చి 14 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కోటవీధిలో వెలసిన లక్ష్మీవేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో అర్చకులు వసంతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటరమణస్వామికి అభిషేకాలు, అర్చనలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి స్వామివారు హంసవాహనంపై మెయిన్‌బజార్, కోటవీధిలో విహరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

# ఆలయ అభివృద్ధికి చేయూత

- తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్‌కు విద్యుత్ లైట్లు అందజేత



విద్యుత్ లైట్లను అందచేస్తున్న దృశ్యం

తాడిపత్రిఅర్బన్, మార్చి 14 ప్రభాతవార్త

పెద్దపప్పూరు మండలం తిమ్మనచెరువు గ్రామంలో వెలసిన వజ్రగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా కొండపై భక్తుల సౌకర్యం కొరకు హైమాస్ విద్యుత్ లైట్లు వేయించటం కొరకు చెదుళ్ల మధుసూదనరెడ్డి (వెంకటాపురం), పూజారి శ్రీనివాసులు (అనంతపురం)లు మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో విద్యుత్ లైట్లను అందచేశారు. తాడిపత్రి నియోజకవర్గం టెంపుల్ సిటీగా చేయడానికి జె.సి ప్రభాకర్‌రెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. ఆలయ అభివృద్ధిలో తమ వంతు సహాయంగా ఈ లైట్లు అందజేసినట్లు వారు పేర్కొన్నారు.

# కర్ణాటక మద్యం స్వాధీనం

పుట్లూరు, మార్చి 14 ప్రభాతవార్త

మండలంలోని కొండేపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బొనాల వెంకట శ్రీనివాసులు అనే వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసి అతని వద్ద నుండి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేంద్రబాబు తెలిపారు. బోనాల వెంకట శ్రీనివాసులు ఇంటి వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు జరిపి అతన్ని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాము, నరేష్ పాల్గొన్నారు.

20 నెలల కాలంలో 450మంది లబ్ధిదారులకు దాదాపు

# రూ.4 కోట్లు సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కదిరి, మార్చి 14 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల కాలంలో కదిరి నియోజకవర్గంలోదాదాపు రూ.4కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు లబ్ధిదారులకు ఆర్థిక సాయాన్ని అందించినట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు, పట్టణాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధికింద మంజూరు అయిన 38,75,804 రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు ఆరోగ్య పరంగా ఇబ్బంది తలెత్తి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ రానటువంటి చికిత్సలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇతోదకంగా సహాయం చేస్తున్నారన్నారు. ప్రతి పక్షాలు ఆలోచన చేసుకోండి, ప్రజలు ఆలోచిస్తున్నారు.. వారంవారం లక్షల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. ఈ స్థాయిలో సహాయం చేసినటువంటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి నియోజకవర్గ ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ కులాలు, మతాలు మధ్య వ్యక్తిగతంగా లేనటువంటి అపద్దాలు, నింధలు వేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని తెలిపారు. అపద్దాలు , మోస పూరిత నాయకులను విస్మరించి ప్రజలు ఆలోచించి ప్రజల కోసం పని చేసే నాయకత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ ట్రస్టు ద్వారా

# రంజాన్ తోఫా, ఉగాది కానుకలు పంపిణీ



రంజాన్, ఉగాది పండుగల తోఫాను పేద ప్రజలకు అందజేస్తున్న దృశ్యం

తలుపుల, మార్చి 14, ప్రభాతవార్త

మండలం కేంద్రం లోని వెలుగు కార్యాలయం నందు శనివారం రూరల్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలో ఉన్న పేద ప్రజలకు రంజాన్ తోఫా పాటు ఉగాది కాలుకలను 100 మందికి పైగా పంపిణీ చేయడం జరిగింది. ఫ్రెండ్స్ ట్రస్ట్ చైర్ పర్సన్ మన్సూర్ మాట్లాడుతూ ముస్లింలకు ఎంతో పవిత్రమైన మాసం రంజాన్, రంజాన్ అంటేనే పేదవారికి సహాయం చేయడమని కాబట్టి ప్రతి ఒక్క పేద ముస్లిం కూడా సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఈ రంజాన్ తోఫాని ట్రస్టు ద్వారా అందించడం జరుగుతుందని తెలియపరిచారు. తెలుగు వారికి తొలి పండగ ఉగాది కాబట్టి పేద ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఉగాది కానుక ఇస్తున్నామని తెలియపరిచారు. ఈ కార్యక్రమానికి మండల ఖాజీ అల్లాబకష్, హోమియోపతి వైద్యులు లక్ష్మీ నరసయ్య, ట్రస్టు సభ్యులు వేణు, బావాజీ, చక్రి, రియాజ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో పూరిళ్లు దగ్ధం

కట్టుబట్టలతో రోడ్డున పడ్డ బాధితులు




అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిన పూరిల్లు

ఓబుళదేవరచెరువు, మార్చి 14, ప్రభాతవార్త

మండలంలోని మారేవాండ్లపల్లిలో శనివారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదం జరిగింది. వ్యవసాయకూలీ నీలి శివప్ప కు చెందిన పూరిళ్లు పూర్తిగా దగ్ధమైంది. 42 వేలు నగదు, జత కమ్మలు, అలాగే రూ. 3.50 లక్షలు విలువైన వ్యవసాయ బోరు మోటరు యంత్ర సామాగ్రి, తిండి గింజలు ఇంట్లోసామాగ్రి కాలిపోవడంతో కట్టు బట్టలతో బాధిత కుటుంబ సభ్యులు రోడ్డు మీద పడ్డారు. బాధితుడు నీలి శివప్ప, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటిలో మంటలు అధికంగా వ్యాపించాయన్నారు . అగ్ని ప్రమాద విషయాన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు వ్యాప్తి అధికమై పూరిళ్లు ఇంట్లో దాచుకున్న రూ. 42 వేలు నగదు, జత కమ్మలు, అలాగే రూ. 3.50 లక్షలు విలువైన వ్యవసాయ బోరు మోటరు యంత్ర సామాగ్రి మంటల్లో కాలి దగ్ధమయ్యాయని బాదితుడు శివప్ప కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. తనకల్లు మండలం కొక్కంటి క్రాస్ లో మా సమీప బంధువులు అంత్యక్రియలకు వెళ్ళి, తిరిగి ఇళ్లు చేరుకోవడంతో తమ ఇల్లు పూర్తిగా ఖాళీ బూడిదైందని బాధితులు వాపోయారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో..

# స్పెల్లింగ్ బి రాష్ట్ర స్థాయి పోటీలు



పోటీలలో గెలుపొందిన విద్యార్థులతో ప్రతినిధులు

అనంతపురం న్యూటౌన్, మార్చి 14 ప్రభాతవార్త

విశ్వం ఎడుటెక్ ఆధ్వర్యంలో స్పెల్లింగ్ బి రాష్ట్ర స్థాయి పోటీలు అనంతపురం లోని ఎంకె సైఫుల్లా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఇందులో 72 పాఠశాలల 140 నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులలో 12 మంది పిల్లలు విజేతలుగా ఎంపికైనట్లు వారు తెలిపారు. వీరు ఏప్రిల్‌లో జరిగే నేషనల్‌లో పాల్గొంటారని విశ్వం ఎడుటెక్ ఆంజినేయులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కె.హేమచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, పివికెకె చైర్మన్ పల్లె కిషోర్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డిలు మాట్లాడుతూ..పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడడానికి విశ్వం ఎడ్యుటెక్ స్పెల్లింగ్ బి అనేది ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి రీజినల్ హెడ్ జె శివాంజినేయులు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు, విశ్వం టీం, తదితరులు పాల్గొన్నారు.

# ఆధైర్య పడొద్దు అండగా ఉంటా

మాజీ మంత్రి పల్లె



ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ మంత్రి పల్లె

నల్లమాడ మార్చి14 ప్రభాతవార్త

తనని నమ్ముకున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కోసం ఎల్లవేళలా అండగా ఉంటామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. నల్లమాడలో నివాసం ఉన్న పులగంపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త గంగాద్రి కుటుంబాన్ని శనివారం మాజీ మంత్రి పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతూ కాలు పోగొట్టుకున్న గంగప్పను , ఇటీవల కదిరిలో కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో రథోత్సవం కింద పడి కాలు దెబ్బతిన్న కుమారుడు అనిల్ ఆరోగ్య పరిస్థితినీ కుటుంబ సభ్యులతో అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రభుత్వం ద్వారా ఆ కుటుంబానికి ఇల్లు ,పెన్షన్ మంజూరు అందరు చేయడంతో పాటు ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని మాజీ మంత్రి భరోసా ఇచ్చారు. అదేవిధంగా గంగాపురానికి చెందిన ఈశ్వరయ్య ,కుటుంబాన్ని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించి వారికి కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల టిడిపి కన్వీనర్ మైలే శంకర్, రామచంద్ర, సలాం ఖాన్,రిటైర్డ్ టీచర్ లక్ష్మన్న,బుట్టి నాగభూషణం, రమణారెడ్డి ,కేశవ రెడ్డి, కోట్ల మంజునాథ్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి ,రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గార్డెన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్

# 15 వ యానివర్స్ డే కార్యక్రమం




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పవన్

నల్లచెరువు మార్చి 14 ప్రభాతవార్త



విద్యార్థులు చే నృత్య ప్రదర్శనలు

మండల పరిధిలోని రత్నాలపల్లి సమీపంలో ఉన్న విద్యకు ఒక మైలురాయి క్రమశిక్షణతో ముందుకు సాగుతున్న మండల పరిధిలోని పేరుగాంచిన కేరళ వాసుల గార్డెన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యాలయ సమస్త వారు నల్లచెరువు మండలంలో విద్యార్థులకు నాన్యమైన విద్యా బోధన అందించాలని దుడ సంకల్పంతో విద్య బోధన అందిస్తున్న విద్యాలయ సంస్థ ప్రిన్సిపాల్ వినయ్, జోబి ఎస్, కరస్పాండెంట్ వారు 15,వ యానివర్స్ డే కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు అందరూ హాజరయ్యారు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాధికారులు తిరుపాల్ నాయక్, డాక్టర్ పవన్ సైన్స్ సిస్ట్, అమ్రోష్ అసిస్టెంట్ ప్రొఫెసర్, బేబీ అగ్ర టెస్ట్ హాజరై తొలిత జ్యోతిని వెలిగించి ఈ కార్యక్రమాన్ని మా తెలుగు తల్లితో వందనం పలుకుతూ కార్యక్రమాన్ని ప్రారంభించారు, ఈ సందర్భంగా చిన్నపిల్లలకు విద్యతో పాటు వివిధ సంస్కృతిక కార్యక్రమాలు పిల్లలు కాదు పిడుగురాళ్లు అనే పెద్దల సామెతతో వివిధ డాన్సలు వివిధ వేషధారణలో నృత్యాలు ప్రత్యేక ఇంగ్లీష్ భాషతో ఇంట్రడక్షన్ పలు కార్యక్రమాలను పిల్లల తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి కనువిందుగా చూసి పిల్లల తల్లిదండ్రులు సంతోషాలు వ్యక్తం చేశారు, ఉత్తమ ఉపాధ్యాయలుగా ప్రిన్సిపాల్ వినయ్ డాక్టర్ పవన్ సైన్సిస్టు, ఎంఈఓ తిరుపాల్ నాయక్ చేతుల మీద. అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉరి వేసుకుని యువకుడు మృతి

పెద్దవడుగూరు, మార్చి 14 ప్రభాతవార్త



కళ్యాణ్ (ఫైల్‌ఫోటో)

పెద్దవడుగూరు మండలం విరుపాపురం గ్రామానికి చెందిన మార్నె కళ్యాణ్ (20) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా వున్నాయి. కళ్యాణ్‌కు ఇంటర్మీడియట్‌లో కొన్ని సబ్జెక్టులు పెండింగ్‌లో వుండేవి. అయితే కళ్యాణ్ చదువకోకుండా ఖాళీగా ఇంటి వద్ద వుంటుండడంతో అతని తండ్రి మార్నె నరసింహులు పలుమార్లు కుమారునితో ఫెయిల్ అయిన సబ్జెక్టులను సప్లిమెంటరీలో కట్టుకుని పాస్ కమ్మని చెబుతూ వచ్చాడు. అయితే కళ్యాణ్‌కు చదువుకోవడం ఇష్టం లేక చనిపోవాలనే ఉద్దేశ్యంతో శుక్రవారం సాయంత్రం ఇంటి నుండి ఊరి బయటకు వెళ్లి కొత్తపల్లి బస్టాండ్‌కు సమీపంలో గల కాశేపల్లి చెన్నారెడ్డి మామిడి తోటలోకి వెళ్లి మామిడిచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కళ్యాణ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

# గ్రామాలను సందర్శించిన జెడ్‌పి సిఈఓ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న సిఈఓ

యాడికి, మార్చి 14 ప్రభాతవార్త

యాడికి మండల పరిధిలోని గ్రామపంచాయతీల్లో ఇంటి పన్నులు వసూలు చేస్తున్న విధానాన్ని శనివారం అనంతపురం జిల్లా పరిషత్ సిఈఓ శివశంకర్ పరిశీలించారు. రాయలచెరువు గ్రామపంచాయతీలో ఇంటి పన్నుల వసూలు అనంతరం సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో యాడికి మండల ఎంపిడిఓ వీర్రాజు, కార్యదర్శి అరుణ్, బిల్ కలెక్టర్ వలి పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

యాడికి, మార్చి 14 ప్రభాతవార్త

యాడికి పరిసర ప్రాంతాల గ్రామాల్లోని గృహాలకు, పరిశ్రమలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. తాడిపత్రి మండలం తేరన్నపల్లిలోని 220 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 7 నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఇందుకు వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

# సామాన్య ప్రజల సమస్యల పరిష్కారమే పార్టీ లక్ష్యం

**జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిచిలకం మధుసూదన్ రెడ్డి**

ధర్మవరంటౌన్ , మార్చి 14 ప్రభాతవార్త


పార్టీజెండావిష్కరిస్తున్న చిలకం మధుసూదన్ రెడ్డి

సామాన్య ప్రజల సమస్యల పరిష్కారమే పార్టీ లక్ష్యమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రదానకార్యదర్శి చిలకం మధుసూదన్రెడ్డి పేర్కొన్నారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని చిలకం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి బైకు ర్యాలీని ప్రారంబించి కాలేజ్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా సాయిబాబా సర్కిల్, అక్కడి నుంచి కళాజ్యోతి, గాంధీసర్కిల్, కదిరిగేటు, తేరుబజారు మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ కు చేరుకుంది. అక్కడ జనసేన పార్టీ జెండాను చిలకం మధుసూదన్రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...జనసేన పార్టీ ప్రజలకోసం పుట్టిన పార్టీ అని,


బైకుర్యాలీ నిర్వహిస్తున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి

సామాన్య ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యమన్నారు.పవన్ కల్యాణ్ ఆశయాలను ప్రతి కార్యకర్త గ్రామగ్రామాన, వార్డుల్లో ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. యువత, రైతులు, కార్మికులు నిరంతరం పోరాడుతుందన్నారు. రాబోవు రోజుల్లోపార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బెస్త శ్రీనివాసులు, అడ్డగిరి శ్యాంకుమార్, సరితాలబాషా, నాగసుధాకర్రెడ్డి.రాజారెడ్డి, డిష్ రాజు, కోటికి రామాంజనేయులు, జయరాంరెడ్డి , ప్యాదిండి వెంకటేష్, ప్రతాప్ లు . పాల్గొన్నారు

## వన్యప్రాణులకు త్రాగునీరు

రొళ్ల మార్చి14 (ప్రభాతవార్త):

ఎండ తీవ్రతను తట్టుకోలేక అల్లాడుతున్న అడవి జంతువులకు ఫారెస్ట్ ఆఫీసర్లు ట్యాంకర్లతో నీరు అందిస్తున్నారు. ఈ మేరకు శనివారం రొళ్ల మండలం వట్టే బెట్ట సమీపంలోని అటవీ ప్రాంతంలో నీటి తొట్టెలకు ట్యాంకర్ ద్వారా నీరు తోలారు. అటవీ ప్రాంతాల్లో వేసవి వచ్చిందంటే చాలు వన్యప్రాణులకు తాగునీటికి కటకట ఏర్పడుతోంది.దీనిని దృష్టిలో ఉంచుకొని అవకాశం ఉన్న చోట్ల నీటితొట్ల ఏర్పాటు చేసి ట్యాంకర్ ద్వారా నీరు అందిస్తున్నారు. గతంలో ఉన్న వాటికి అదనంగా మరికొన్ని నీటి తొట్టెలను నిర్మించడంతో పాటు వాటికి నేరుగా నీటి సరఫరాకు అవకాశంలేని చోట్ల ట్యాంకుల ద్వారా వారానికి ఒకసారి నీటితో నింపనున్నట్లు బీట్ ఆఫీసర్ సంజీవ రాయుడు చెప్పారు.


అటవీ ప్రాంతంలో ట్యాంకర్ ద్వారా తొట్టెకు నీరు నింపుతున్న దృశ్యం

## ప్రమాదంలో కాళ్లు విరిగిన వ్యక్తికి ఆర్థిక సాయం

సోమందేపల్లి మార్చి 14 ప్రభాతవార్త


కాలు విరిగిన ఎం వీరాచారికి ఆర్థిక సాయం అందజేసిన తెదేపా నాయకులు

మండల కేంద్రంలోని రాంబాబు కాలనీ నందు. గత నాలుగు రోజుల క్రితం రోజువారీ కూలీ పనులను నిమిత్తం హిందూపూర్ పోతుండగా మలుగురు క్రాస్ వద్ద ఆటో బోల్తా పడడం జరిగింది. ఆ ప్రమాదంలో రాంబాబు కాలనీ చెందిన లీ వీరాచారికి కాలు పూర్తిగా విరగడం . విషయం తెలుసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమం నిజాళీ చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు తక్షణ సాయం కింద 10000( పదివేల రూపాయలు ) నియోజవర్గ నాయకులు నీరుగంటి చంద్రశేఖర్ , ఆ కుటుంబ సభ్యులకి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వి సురేష్, క్లస్టర్ ఇంచార్జ్ లీ మద్దిలేటి, బూత్ కన్వీనర్ జు లక్ష్మీనారాయణ ,మన్సూర్ బాషా ,ఓబులేష్, విశ్వనాథ్, దీ భాష కాలనీ వాసులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ వద్దు...లోకల్ ముద్దు...!

**ధర్మవరంలో లెన్స్ కార్ట్ ఏర్పాటు వద్దంటున్న ఆప్టికల్ అసోసియేషన్ సభ్యులు...!**

ధర్మవరం,మార్చి14,ప్రభాతవార్త


నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ధర్మవరంలో లెన్స్ కార్ట్ ఏర్పాటు చేయవద్దంటూ ధర్మవరం ఆప్టికల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ నిరసనకు సీపీఐ నాయకులు, వస్త్ర వ్యాపారులు,కిరాణావ్యాపారులు, మొబైల్, ఎలక్ట్రానిక్స్ వ్యాపారసంఘాల ప్రతినిధులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు. ధర్మవరం ఆప్టికల్ అసోషియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... పట్టణంలోకార్పొరేట్ ఆప్టికల్ చైన్ లెన్స్ కార్ట్ ఏర్పాటుచేయాలన్న ఖిఖిప్రయత్నంఖి చేస్తుండటంతో వ్యాపార వర్గాల్లోతీవ్ర ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న తమకు జీవన ఆధారాలను నాశనం చేసే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. లెన్స్ కార్ట్ ఏర్పాటు చేస్తే స్థానిక ఆప్టికల్ వ్యాపారులు కొంతమంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు.అలాగే ఉద్యోగులు, టెక్నీషియన్లు, ఇతర అనుబంధ రంగాల వారితోకలిపి పరోక్షంగా ఉపాధి పొందుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పెద్ద కార్పొరేట్ సంస్థ ధర్మవరంలోకి ప్రవేశిస్తే చిన్న వ్యాపారులు నిలబడలేక మూతపడే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటనారాయణ, ధర్మవరం ఆప్టికల్స్ అసోషియేషన్ ప్రతినిధులు శ్రీకాంత్ రెడ్డి, విద్యార్థిసంఘాల నాయకులు మంజుల నరేంద్ర, సీపీఐఎంఎల్ జిల్లానాయకులు పోలాలక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు..

కొత్తచెరువు మార్చి 14 ప్రభాతవార్త


పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న జనసైనికులు దృశ్యం

కొత్తచెరువు మండల కేంద్రంలో మండల అధ్యక్షులు పూల శివప్రసాద్ అధ్యక్షతన స్థానిక మండల నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో జనసేన పార్టీ 13 వ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్ పాల్గొని పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పత్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ 12 సంవత్సరాల క్రితం ఒక్కడితో మొదలైన పార్టీ ఈరోజు దాదాపు 13 లక్షల పైచిలుకు మంది సభ్యులతో పార్టీ బలపడిందన్నారు. నియోజకవర్గంలో కూడా జనసైనికు లందరూ కష్టపడి పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చెయ్యాలని పిలుపుని చ్చారు.. అనంతరం పూల శివప్రసాద్ మాట్లాడుతూ ఉపముఖ్య మంత్రి వర్యులు, మన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రజల కోసం పార్టీ పెట్టి నేటికి 12 సంవత్సరాలు పూర్తిచేసుకొని 13వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నామని, ఈక్రమంలో పార్టీ ఎన్నోఒడిదుడుకులను తట్టుకొని ఈరోజు రాష్ట్రంలో జనసేన పార్టీ లేకుండా రాజకీయం ఉండదు అనే రకంగా పార్టీ బలోపేతం అయిందని, కూటమి ప్రభుత్వంలో తమ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నడిపిస్తున్న శాఖల పనితీరు ,జరుగుతున్న అభివృద్ధిని గమనిస్తే ఆయనకు ప్రజలపట్ల ఉన్ననిబద్ధతను తెలియజేస్తాయని తెలిపారు. అలాగే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా కూటమిలో జనసేన పోటీ చేసి స్థానాల్లో గెలిచేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ దాసరి నారాయణ స్వామి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పూల గోవర్ధన్, ఐటీ కోఆర్డినేటర్ విష్ణు వర్ధన్, మండల ప్రధాన కార్యదర్శి హనుమంతు నాయక్, స్థానిక మండల నాయకులు పూల వెంకటేష్, గాజుల నాగేంద్ర, పూల రెడ్డప్ప, గూడ సోము, మరియు జనసైనికులు పాల్గొన్నారు.

## 16 నుండి ఒంటిపూట బడులు ప్రారంభం

అమరాపురం మార్చి 14 ప్రభాతవార్త


మండల విద్యాశాఖ అధికారి దృశ్యం

మండల పరిధిలోని ప్రభుత్వ ,ప్రైవేట్ పాఠశాల ల్లో ఈనెల 16వ తేదీ నుండి ఏప్రిల్ 23 వరకు ఒంటి పూట బడులను ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిం చాలని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ తెలిపారు. 16వ తేదీ నుండి ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకు పాఠశాలలను నిర్వహించాలని ఎంఈఓ తెలిపారు. విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు దీనిని దృష్టిలో ఉంచుకొని సకాలంలోపాఠ శాలలకు వచ్చే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలని ఆయన తెలిపారు. మధ్యాహ్నం భోజనం పిల్లలకు వండించిన తర్వాతే పిల్లలను ఇంటికి పంపిస్తామని. సకాలంలో విద్యార్థిని తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలను ఇంటికి తీసుకువెళ్లాలని మండల విద్యాధికారి కోరారు. ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని తమ పిల్లలపట్ల జాగ్రత్త తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అదేవిధంగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు 16 నుండి ప్రారంభమవుతాయని సకాలంలో విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు విచ్చేసి బాగా పరీక్షలు రాయాలని ఆయన పేర్కొన్నారు.

## నేడు కుంచిటి వక్కలిగుల సమావేశం

గుడిబండ మార్చి 14 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని తుమ్మల మారెమ్మ దేవాలయం ఆవరణంలో నేడు మధ్యాహ్నం 1 గంటలకు కుంచిటి వక్కలిగ కులస్థుల సమావేశం ఏర్పాటు చేసినట్లు లక్ష్మీనరసప్ప, నాగరాజు,డిఎల్ యంజారేగౌడ్,కెఎన్ పల్లి సురేష్ తెలిపారు.ఈసందర్భంగా వారుమాట్లాడుతూ మడకశిర నియోజకవర్గం కుంచిటి వక్కలిగసంఘం అధ్యక్షుడినినియమించడానికి అవసరమైన డైరెక్టర్ల ను ఎన్నుకోవడానికి గుడిబండ మండలంలోని కుంచిటిగ కులస్తులు నేడు ఆదివారం మధ్యాహ్నం 1గంటలకు తుమ్మలమారెమ్మ దేవాలయం ఆవరణం లో నిర్వహించే సమావేశానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## సోలార్ కంట్రోల్ స్కిల్స్ విభాగంలో శిక్షణ

గుత్తి, మార్చి 14 ప్రభాతవార్త


సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం

గుత్తి పట్టణంలోని సిఎస్ఐఆర్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ టెక్నాలజీ కళాశాలలో పీపుల్ ట్రీ ఫౌండేషన్ మరియు సెంబ్ కార్ప్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత సోలార్ కంట్రోల్ ప్యానెల్ టెక్నీషియన్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా అభ్యర్థులకు సోలార్ ఇన్స్టలేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ ఆపరేటింగ్ అంశాలలో దాదాపు 100 మందికి పైగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అభ్యర్థులకు శంకరానంద డిగ్రీ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్కె నాయుడు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. యువత శిక్షణను వినియోగించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కెఎస్కె సునీల్, రమీజా కంప్యూటర్ డైరెక్టర్ నిజాం, ట్రైనర్లు పవన్, శరత్నాయక్, రామ్మోహన్, సురేష్రెడ్డి, సంపత్కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితేనే మనుగడ సాధ్యం

**-గోరంట్లలో ఎరుకుల సంక్షేమ సంఘం నూతన కమిటీలు ఎన్నిక**

**-జిల్లా అధ్యక్షునిగా గోరంట్ల వాసి పివి చలపతి ఏకగ్రీవ నియామకం**

గోరంట్ల, మార్చి 14 ప్రభాతవార్త


జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన చలపతి (ఫైల్ఫోటో)


కమిటీ ఎన్నికల్లో పాల్గొన్న జిల్లా సంఘం నేతలు

స్థానిక గోరంట్ల శ్రీసరస్వతి విద్యా మందిరం ఆవరణంలో ఎరుకుల సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికల కార్యక్రమాల సమావేశము శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎరుకల కులస్తులు పాల్గొని జిల్లా, నియోజకవర్గ మరియు మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏరుకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షునిగా గోరంట్ల పట్టణానికి చెందిన పివి చలపతిని సంఘం నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు జిల్లా ఉపాధ్యక్షుడిగా గంగాధర తదితరులను నియమించారు. నియోజకవర్గం ప్రెసిడెంట్ ఏ.గంగాధర్, వైస్ ప్రెసిడెంట్ యు.శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ వైజి గంగాధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వై. నరసింహులు, సెక్రెటరీ ఏ.మూర్తి, జాయింట్ సెక్రెటరీ నాగరాజు, గోరంట్ల మండలం గౌరవ అధ్యక్షులు శ్రీవన్నప్ప, అధ్యక్షులు యు.శ్రీనివాసులు. ఉపాధ్యక్షులు రమణప్ప, సెక్రటరీ ఎస్.నాగరాజు. జాయింట్ సెక్రెటరీ వెంకటేష్, ఆదినారాయణ, అశ్వత్తప్ప, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సాకే అంజి, గోరంట్ల టౌన్ ప్రెసిడెంట్ నరసింహప్ప, వైస్ ప్రెసిడెంట్ ఎస్.కుల్లాయప్ప, జనరల్ సెక్రెటరీ సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సూరి, జాయింట్ సెక్రెటరీ బాలకృష్ణలను నియమించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పి.వి చలపతి ప్రసంగిస్తూ భగవంతుని పుణ్యమా అని ఆనాడు బాబాసాహెబ్ అంబేద్కర్ మనకు పెట్టిన భిక్ష రిజర్వేషన్లు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. కురువంశ చరిత్ర ఆదివాసులదేనని పేర్కొన్నారు. సంఘం అభివృద్ధి కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## పెన్నహోబిళంలో వైభవంగా లక్ష్మినరసింహస్వామి పల్లకీ ఉత్సవం

**- భక్తులు, పర్యాటకులతో కిటకిటలాడిన ఆలయం**

ఉరవకొండ, మార్చి 14 ప్రభాతవార్త


పెన్నహోబిళంలో జరిగిన లక్ష్మినరసింహస్వామి పల్లకీ ఉత్సవం

ఉరవకొండ మండలం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో కొలువైన లక్ష్మినరసింహస్వామి పల్లకీ ఉత్సవం స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం పాల్గుణ శుద్ధ ఏకాదశి శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. దేవాదాయ ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.యన్.తిరుమలరెడ్డి పర్యవేక్షణలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీరి ్చగా ప్రధానాలయం చుట్టూ ప్రదీక్షిణ నిర్వహించారు. చుట్టుప్రక్కల గ్రామాల నుండే కాకుండా జిల్లా నలుమూలలు, కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు, పర్యాటకులు పెద్దఎత్తున క్షేత్రానికి తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**- ఏర్పాట్లను పరిశీలించిన ఉపవిద్యాధికారి శ్రీనివాసరావు**

గుంతకల్లు, మార్చి 14 ప్రభాతవార్త


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉపవిద్యాధికారి

ఈనెల 16 సోమవారం నుండి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారులు మస్తాన్రావు, సుబ్బరాయుడు తెలిపారు. పట్టణంలో 9 సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొత్తం 2409 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నట్లు పేర్కొన్నారు. శనివారం పరీక్ష కేంద్రాలను అనంతపురం డివిజన్ ఉప విద్యాధికారి శ్రీనివాసరావు పరిశీలించారు. ప్రధానంగా మౌలిక సదుపాయాలైన ఫ్యాన్లు, ఫర్నీచర్, తాగునీరు, వెలుతురు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. అనంతరం పలువురు ఇన్విజిలేటర్లకు పరీక్షలపై అవగాహన కల్పించారు.

## గుత్తిలో విజిలెన్స్ దాడులు

**-12 గ్యాస్ సిలిండర్లు సీజ్**

గుత్తి, మార్చి 14 ప్రభాతవార్త


గ్యాస్ సిలిండర్లను సీజు చేసిన దృశ్యం

పట్టణంలో శనివారం విజిలెన్స్ మరియు ఎన్ఫోర్స్ మెంట్ వైబిపిటిప ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ గోపాలుడు గ్యాస్ ఫిల్లింగ్ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గుంతకల్లు రోడ్డులో ఉన్న మహమ్మద్ అనే వ్యక్తి దుకాణంలో సిలిండర్లను రీ ఫిల్లింగ్ చేస్తున్నారని దాడులు చేశారు. ఈ సందర్భంగా రీ ఫిల్లింగ్ మిషన్తో పాటు 12 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. అనంతరం వాటిని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గోపాలుడు మాట్లాడుతూ గృహ వినియోగానికి సంబంధించిన సిలిండర్లను వాణిజ్యపరంగా వినియోగిస్తే, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడులలో ఏఈఈ రవీంద్ర, వీఆర్ఓ వెంకటరమణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ రామిరెడ్డికి ఘన సన్మానం

గుంతకల్లు, మార్చి 14 ప్రభాతవార్త


ఆలూరు రామిరెడ్డిని సన్మానిస్తున్న గుంతకల్లు న్యాయవాదులు

ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో కౌన్సిల్ మెంబర్గా ఎన్నికైన ఆలూరు రామిరెడ్డిని గుంతకల్లు న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. శనివారం అనంతపురంలోని ఆయన స్వగృహంలో కలిసి శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, బి.జయరాం, బి.రమేష్, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శి బి,తిమ్మప్ప, సీనియర్ న్యాయవాదులు చెన్నకేశవులు, బిఎస్ కృష్ణారెడ్డి, తిమ్మారెడ్డి, బడే సాబ్, గోపాలకృష్ణ, వీరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## రెండు వేరు వేరు ఘటనాల్లో ఇద్దరు ఆత్మహత్య

**అప్పుల బాధతో రైతు ఆత్మహత్య మూర్ఛ వ్యాధితో బాధపడుతూ మహిళా ఆత్మహత్య**

తాడిమర్రి మార్చి 14 (ప్రభాతవార్త)


ఆత్మహత్య చేసుకున్న మహిళ దీపిక,ఆత్మహత్య చేసుకున్న రైతు వెంకటేష్

మండల పరిధిలోని రెండు వేరువేరు గ్రామాలలో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న ఘటనలో నిడిగల్లు గ్రామానికి చెందిన దీపిక(21) గత కొన్ని సంవత్సరాలుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతూ తీవ్ర మనస్తాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులుతెలిపారు. మరో సంఘటనలో పుల్లంపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్( 47)అప్పుల బాధ తాళలేక మనస్థాపం చెంది శనివారం పురుగులమందుతాగి ఆత్మహత్యచేసుకున్నారు. వ్యవసాయమే జీవనాధారం గాజీవిస్తున్న వెంకటేష్ పంటల సాగుకోసం చేసినఅప్పులుతీర్చలేని పరిస్థితు ల్లో తీవ్రమైన మనస్థాపం చెంది ఇంటిలో ఎవరూలేని సమయంలో పురుగుల మందుతాగారు. వెంటనేస్థానికులు బంధువులు అప్రమత్తమై బత్తలపల్లి ఆర్డిటి ఆసుపత్రికి తరలించారు.అక్కడచికిత్స పొందుతూ తుదిశ్వాసవదిలారు. మృతుడు వెంకటేష్కు భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు. పై రెండు ఆత్మహత్య ఘటనలపై కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై కృష్ణవేణి తెలిపారు.

## అప్పులబాధ తాళలేక గుండెపోటుతో చేనేత కార్మికుడి మృతి

ధర్మవరంటౌన్ , మార్చి 14 ప్రభాతవార్త


బోనాల హరిక్రిష్ణ (ఫైల్ఫోటో)


మృతి చెందిన బోనాల హరికృష్ణ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

అప్పుల బాధతో తరచూ తీవ్ర మనోవేధనకు గురవుతూ చివరికి గుండెపోటుతో మృతిచెందిన సంంఘటన శనివారం పట్టణంలోని బాలాజీనగర్ లో చోటు చేసుకుంది. కుటుంసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు....బాలాజీనగర్ కు చెందిన బోనాలహరిక్రిష్ణ (44) మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈయనకు భార్య బోనాలహేమలత, ఒక కుమార్తె బోనాలపూజిత ఉన్నారు. అయితే మృతుడు మొదట్లో సొంత మగ్గం నేస్తూ జీవనం సాగించేవాడు. రానురాను ముడిపట్టుధరలు పెరగడం, నేసిన చీరలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో మగ్గాన్ని చుట్టేసి కూలిమగ్గం నేస్తున్నాడు. అయితే కుటుంబ అవసరాలకు, కూలికినేసిన చీరకు గిట్టుబాటు ధర లబించకపోవడంతో చేసిన రూ.లక్షల అప్పులుఎలా తీర్చాలో అంటూ తీవ్రమనోవేధనకు గురయ్యేవాడు.ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున ఉన్నఫలంగా చాతిలో నొప్పివచ్చి కుప్పకూలి పోయాడు. వెంటనే కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న చేనేత ప్రముఖుడు, టీడీపీనాయకులు సందారాఘవ రూ.10వేలు అంత్య క్రియల కోసం తన స్నేహితులైన జింకాపురుషోత్తం, 35వవార్డు టీడీపీ ఇన్చార్జ్ లెజెండ్ నారాయణస్వామి, ఉపాధ్యక్షులు చింత లచ్చి, మునుస్వామి, ప్రభాకర్ ల ద్వారా మృతుని భార్యకు అందజేశారు.

## భక్తిశ్రద్ధలతో గీతాపారాయణం, ప్రవచన కార్యక్రమాలు

**- లక్ష్మి వెంకటేశ్వరస్వామి, పంచముఖ ఆంజనేయస్వామికు ప్రత్యేక పూజలు**




గీతాపారాయణం నిర్వహిస్తున్న గీత ప్రచారక్ దివాకర్

ఉరవకొండ, మార్చి 14 ప్రభాతవార్త

పట్టణంలోని అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారికి పక్కనగల డ్రైవర్స్ కాలనీలోని లక్ష్మివెంకటేశ్వరస్వామి సహిత పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం పాల్గుణ శుద్ధ ఏకాదశి శనివారం సాయంత్రం గీతాపారాయణం, ప్రవచన కార్యక్రమాలు భక్తిశ్రద్ధల నడుమ జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గీతా ప్రచారక్ దివాకర్ భగవద్గీత సారాన్ని భక్తులకు వివరించారు. సాటి మానవులు, జంతువులు, పక్షులు పట్ల భూత దయ కలిగి ఉండాలని, ఇతరుల పట్ల ద్వేషభావం ఉండకూడదని, రాగద్వేషాలను పూర్తిగా వదిలిపెట్టాలని భగవద్గీత సారం చెబుతుందన్నారు. కాగా ఉదయం లక్ష్మివెంకటేశ్వరస్వామి, పంచముఖ ఆంజినేయస్వామి మూలవిరాట్లకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు సాయిక్రిష్ణ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రతాప్, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

**శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మోర్య భరద్వాజ్**

పెనుకొండ మార్చి 14 ప్రభాతవార్త


ఇండియన్ గ్యాస్ గోడౌన్ ను తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్

గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ మోర్య భరద్వాజ్ తెలిపారు. శనివారం పెనుకొండ లోని ఇండియన్ గ్యాస్ గోడౌన్ ను జాయింట్ కలెక్టర్ మోర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. గ్యాస్ ఏజెన్సీలో రికార్డుల ప్రకారము గ్యాస్ నిలువలు పరిశీలించారు. లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నటువంటి విధానము అడిగి తెలుసుకున్నారు, ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి లబ్ధిదారులకు గ్యాస్ అందజేయడం జరుగుతుందని,గ్యాస్ స్టాక్ ఉందని ప్రతి ఒక్కరు మీ ఇళ్ల వద్దే ఉండండి గ్యాస్ ఆఫీస్ దగ్గరకు రావలసిన అవసరం లేదు నేరుగా మీఇంటి వద్దకే గ్యాస్ డెలివరీ ఇవ్వబడును, గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ విషయం ప్రతి ఒక్కరు గమనించాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ తో పాటు పౌరసరఫరాల డిప్యూటీ తాసిల్దార్ ప్రభావతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

## అయ్యప్ప భక్త భజన మందిరానికి భూమి పూజ చేసిన మాజీ మంత్రి పల్లె

బుక్క పట్నం, మార్చి 14, ప్రభాతవార్త


భూమి పూజ చేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

మండల కేంద్రమైన బుక్కపట్నం లోని చెరువు కట్ట వద్ద అయ్యప్ప స్వామి భక్త భజన మందిరానికి శనివారం మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి భూమి పూజ చేశారు. అయ్యప్ప ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని పల్లె ఆకాంక్షించారు. మాజీ మంత్రి వెంట బుక్కపట్నం మండల టీడీపీ కన్వీనర్ మల్లి రెడ్డి,టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ,సహకార సంఘం అధ్యక్షుడు చెన్నకృష్ణ ,టీడీపీ మహిళా కార్యదర్శి లావణ్య ,మంజు, సాయి, జయరాం ,సంజీవ ,బాలు ,మండల కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## 334 మంది విద్యార్థులు గైర్హాజరు

**కొత్త చెరువు మార్చి 14 ప్రభాత వార్త :** శ్రీసత్య సాయి జిల్లా లో 41 పరీక్ష కేంద్రాల యందు 17 వ రోజు ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయనీ డి ఐఈ ఓ చెన్న కేశవ ప్రసాద్ తెలిపారు శనివారం ప్రథమ సంవత్సర విద్యార్థులకు సివిక్స్ పరీక్ష జరిగింది.జిల్లా వ్యాప్తంగా 4299 మంది విద్యార్థులకు గాను 3965 మంది విద్యార్థులు హాజరు అయ్యారు.334 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు, జిల్లా పరీక్ష నిర్వహణ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు మరియు కస్టోడియన్ లు జిల్లాలోని వివిధ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఎటువంటి మాల్ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదుఅన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో 213 కేసుల పరిష్కారం

**- రూ.34.50 లక్షల సెటిల్‌మెంట్ మొత్తాలు, అపరాధ రుసం వసూళు**

ఉరవకొండ, మార్చి 14 ప్రభాతవార్త



ఉరవకొండ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి డి.దుర్గాకళ్యాణి ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్ దృశ్యం

ఉరవకొండ పట్టణంలోని స్థానిక మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో శనివారం మండల న్యాయ సేవా అధికార కమిటీ ఆధ్వర్యంలో జూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.దుర్గా కళ్యాణి ఆధ్యక్షతన జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 213 కేసులు పరిష్కారంకాగా కక్షిదారులను నుండి 34,50,300 రూపాయలు సెటిల్‌మెంట్ మొత్తాలు, అపరాధ రుసం వసూళు చేయడం జరిగిందని కోర్టు వర్గాలు తెలిపాయి. లోక్ అదాలత్‌లో ఐపీసీ, బీఎన్ఎస్ కేసులు 12, ఎక్సైజ్ కేసులు 34, ఈపీ కేసు ఒకటి పరిష్కరంకాగా 1,75,000 రూపాయలు, ఓఎస్ మణి కేసులు 2 పరిష్కారంకాగా 1,70,000 రూపాయలు, ఓఎస్ బ్యాంకు కేసులు 3 పరిష్కారంకాగా 10,93,000 రూపాయలు, ఎస్‌టీసీ (పెట్టి) కేసులు 123 పరిష్కారంకాగా 1,75,800 రూపాయలు, బ్యాంకు పీఎల్‌సీ కేసులు37 పరిష్కారంకాగా 17,11,500 రూపాయలు, ఎన్ఐ యాక్ట్ కేసు ఒకటి పరిష్కారంకాగా 1,25,000 రూపాయలు వసూళు చేయడం జరిగిందని వివరించారు. ఈ లోక్ అదాలత్‌లో ఏపీపీ హేమలత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్‌బాబు, బెంచ్ సభ్యులు నాగేంద్ర, శ్రీనివాసులు, జయరాజ్, దామోదర్‌నాయుడు, లీలావతి, తుకారం, చెన్నరాయుడు, నవీన్, రాంమోహన్, నవీన్, సురేష్‌బాబు, విజయ్‌కుమార్, పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు, వివిధ బ్యాంకుల అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 16 నుండి 10 తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

అమరాపురం మార్చి 14 ప్రభాతవార్త



పరీక్షలకు సిద్ధమైన దృశ్యం

అమరాపురం మండలం కేంద్రం లోని పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల విద్యాధికారి సత్యనారాయణ తెలిపారు.16 నుండి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చక్కటి వాతావరణం కలిగినటువంటి పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మూడుపి ఎం శ్రీ ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు ఒకగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో డాక్టర్లు కూడా నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పరీక్ష కేంద్రానికి దాదాపుగా 300 మీటర్లు జెరాక్స్ సెంటర్లను మూసివేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై వలీభాష తెలిపారు. పరీక్షలు ప్రారంభమైన తర్వాత ఇతరులు పరీక్ష కేంద్రాలలో అనుమతించకూడదని ఈ సందర్భంగా కోరారు.

# ఘనంగా అన్నమయ్య ఆచారి523 వర్ధంతివేడుకలు

ధర్మవరంటౌన్ , మార్చి 14 ప్రభాతవార్త



అన్నమయ్య విగ్రహం వద్ద సంకీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

పట్టణంలోని అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పోరాళ్లపుల్లయ్య ఆధ్వర్యంలో అన్నమయ్య ఆచారి 523వ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీచెన్నకేశవ ఆలయం ఎదురుగా ఉన్న అన్నమయ్య విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించి అనంతరం అన్నమయ్యసేవా మండలిసభ్యులు పూలమాల వేసి అనంత రం అన్నమయ్య సంకీర్తనలు గావించారు.

# ఉరవకొండలో ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**- చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు, కేక్ కటింగ్, రోగులకు అన్నదానం**



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గౌతమ్‌కుమార్

ఉరవకొండ, మార్చి 14 ప్రభాతవార్త

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలో శనివారం ఘనంగా జరిగింది. పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తొలుత స్థానిక ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయం చేరుకొని కేక్ కట్ చేసి స్థానిక 50 పడకల ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ జనసేన పార్టీ 12 సంవత్సరాలు పూర్తి చేసుకొని 13వ సంవత్సరంలోని అడుగు పెట్టిందన్నారు. 150 మందిలో జన సేనాని, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో ఆవిర్భవించిన పార్టీ నేడు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తోందన్నారు. పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉరవకొండ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, నాయకులు రాజేష్, రమేష్, మధు, మనికుమార్, అనీల్, భోగేష్, రమణ, తికల్, శేఖర్, రఘు, అభి, ధనుంజయ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరం డిజైనర్ నాగరాజుకు చైనా ప్రభుత్వ ఆహ్వానం

ధర్మవరంటౌన్ , మార్చి 14 ప్రభాతవార్త

చైన దేశ రాజధాని బీజింగ్, గాంష్టుహౌనగరం లో మార్చి 14 నుంచి 16వతేదీ వరకు మూడురోజులపాటు జరిగే వసంత్ మేళా కార్యక్రమానికి తనను ఆహ్వానించినట్లు ధర్మవరం డిజైనర్, జాతీయ అవార్డు గ్రహిత జూజూరు నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వసంత మేళా కార్యక్రమంలో జూజూరు నాగరాజు ధర్మవరం చేనేత పట్టు చీరల ప్రదర్శన, తయారీ విధానం తెలపడం జరుగుతుందన్నారు. ప్రపంచంలో టెక్నాలజీ పరంగా ఎంతో ముందుంటున్న చైనా దేశం మన చేనేతను వారి దేశానికి ఆహ్వానం పలకడం తనకు ఎంతో గర్వకారణమన్నారు.

# యోగాతో ఒత్తిడుల నుంచి ఉపశమనం, ఆనందం, ఆరోగ్యం

**- అంతర్ముఖ, ఆనంద, ఆరోగ్య యోగ శిబిరంలో యోగా గురువు భిక్షమయ్య**

**- హాజరైన గవిమఠ సంస్థానం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి**

ఉరవకొండ, మార్చి 14 ప్రభాతవార్త



సందేశాన్నిస్తున్న గవిమఠం ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి. చిత్రంలో భిక్షమయ్య గురూజీ

నేటి ఆధునిక సమాజంలో నిత్యం ఎన్నో రకాల ఒత్తిడులతో సతమతమవుతుంటామని వాటి నుండి బయట పడటానికి యోగ సాధన ఎంతగానో ఉపయోగపడి ఆనందాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాధిస్తుందని ప్రముఖ యోగా గురువు భిక్షమయ్య అన్నారు. సత్యసాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో పట్టణంలోని రామలింగ చౌడేశ్వరి దేవాంగ కళ్యాణమండపంలో శనివారం 'అంతర్ముఖ, ఆనంద, ఆరోగ్య యోగ' శిబిరం స్థానిక యోగా గురువు తాటికొండ వెంకట్ అధ్యక్షతన జరుగగా ఆయనతోపాటు



హాజరైన అభ్యాసకులు

స్థానిక గవిమఠ సంస్థానం ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసవరాజేంద్ర స్వామి ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యోగ గురువు భిక్షమయ్య మాట్లాడుతూ మానవుడు భౌతికంగాశరవేగంగా అభివృద్ధి చెందుతూ అంతరిక్షాన్ని సైతం ఆక్రమించు కునేందుకు కృషి చేస్తున్నాడని అయితే అంతరంగశుద్ధి మీద దృష్టినికేంద్రీకరించడం లేదన్నారు.దీంతో భయంకరమైన రుగ్మతలతో సమస్యల సుడి గుండంలో చిక్కుకొని పరిష్కారం కోసం విఫలయత్నం చేస్తున్నాడని అయినా ఫలితం దక్కడంలేదన్నారు. మనకు ఋషులు, పూర్వీకులు అందించి ఆధ్యాత్మిక మార్గంతప్ప వేరేమరొక ప్రత్యాన్మాయమేలేదన్నారు. నిత్యం యోగకు కొంత సమయం కేటాయిస్తే శరీరంలో తద్వారా జీవితంలో ఎన్నోఅనూహ్యమార్పులను చవిచూస్తారన్నారు. ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి ప్రతిఒక్కరూ రోజువారి కార్యకలాపాల్లో దైవచింతన, యోగాను భాగం చేసుకుంటే మానసిక, శారీరక ఆరోగ్యం పొందవచ్చని సూచించారు. శివుని ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదని తెలుసుకొని ఆధ్యాత్మిక చింతన చేస్తే సర్వేశ్వరుని కృపా కటాక్షాలు పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు నాగమల్లి ఓబులేష్, చంద్రశేఖర్, సునీత, రామాంజినేయులు పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన యోగ సాధకులు భారీగా పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేసిన టీడీపీ

**- పయ్యావుల సోదరుల ఆదేశాలతో కొనసాగిన పంపిణీ**

ఉరవకొండ, మార్చి 14 ప్రభాతవార్త



వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని తెలుగుదేశం పార్టీ శనివారం పట్టణంలో రోడ్లపై వ్యాపారాలు చేసుకొనే చిరు వ్యాపారులకు గొడుగులను పంపిణీ చేసింది.




పాత బస్టాండులో గొడుగులు పెట్టుకొని తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకొంటున్న దృశ్యం

చుర్రుమనే ఎండలో ఉదయం మొదలు సాయంత్రం వరకు పాత బస్టాండ్ ప్రాంతంలో కూరగాయలు, పండ్లు అమ్ముతూ ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారుల కష్టాన్ని గుర్తించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు చిరు వ్యాపారుల వద్దకే వెళ్లి గొడుగులను పంపిణీ చేశారు. అన్నివర్గాల సంక్షేమం కోసం పాటుపడటమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మెన్ నరిశేటి విజయ భాస్కర్, పీఏసీఎస్ ఛైర్మెన్ ప్యారం కేశవానంద, లక్ష్మీనరసింహస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రేగటి నాగరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టుబడి ఖలంధర్, యేళ్ల తిమ్మప్ప, యర్రగుంట్ల వెంకటేష్, పి.రాజేష్, పి.నిరంజన్‌గౌడ్, ఎం.రామాంజినేయులు, ఎం.వరప్రసాద్, బీరే శేఖర్, ఈడిగ వేణుగౌడ్, మణిచౌదరి, శంకర సుదర్శన్, నిమ్మల ప్రసాద్, ఆకుతోట బాలాజీ, వడ్డే లాలుస్వామి, రమేష్, పల్లా హరి, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం వెంటనే ఆపాలి

**-దేశంలో వ్యవసాయంను దెబ్బతీసే అమెరికా-భారత్ ఒప్పందం రద్దు చేయాలి -ఉరవకొండలో టార్చ్‌లైట్లతో సీపీఎం అనుబంధ సంఘాల నిరసన ప్రదర్శన**

ఉరవకొండ, మార్చి 14 ప్రభాతవార్త



క్లాక్‌టవర్ కూడలిలో నిరసన తెలుపుతున్న సీపీఎం పార్టీ శ్రేణులు

ఇరాన్ దేశంపై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపివేసి మానవాళి ప్రాణాలను కాపాడటానికి ఐక్యరాజ్య సమితి కృషి చేయాలని సీపీఎం అనుబంధ సంఘాలు డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక కవితా సర్కిల్‌లో శనివారం రాత్రి టార్చిలైట్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.రంగారెడ్డి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లాప్రధానకార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి తదితరులు మాట్లాడుతూ గత మూడుసంవత్సరాలుగా అమెరికా వివిధ దేశాల్లో దొరుకుతున్న ఆయిల్, గ్యాస్, ఖనిజ సంపదలను దోచుకోవడానికి పేద దేశాలపై అక్రమ యుద్ధం ప్రకటించి ఆధునాతమైన ఆయుధాలను ఉపయోగించి పసిపిల్లలు, వృద్ధులను సైతం అతి కిరాతకంగా చంపుతోందన్నారు. ప్రజల నివాస ప్రాంతాలు, విద్యాలయాలు, ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తోందని మండిపడ్డారు. పాలస్తీనా, ఇరాన్, లేబనాన్ తదితర దేశాల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. అమాయక ప్రజల శవాల గుట్టలపై అమెరికా సంపదను పోగేసుకొంటోందని ఇప్పటికైనా యుద్ధం ఆపాలన్నారు. అమెరికా-భారత్ మధ్య జరిగిన ఒప్పందం దేశంలో వ్యవసాయాన్ని దెబ్బతీస్తుందన్నారు. గోరు చుట్టపై రోకటి పోటులా ఇప్పటికే రైతాంగం నష్టపోతుంటే మన వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి చేస్తే 18శాతం అవనంగా పన్ను వేస్తుందని అదే అమెరికా నుండి మన దేశంలోకి దిగుమతి చేసుకుంటే ఒక్క రూపాయి కూడా సుంకం వేయకుండా మోదీ, ట్రంప్ మధ్య ఒప్పందం కుదిరిందని వాపోయారు. పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దముష్టూరు వెంకటేష్, సిద్దప్ప, సురేష్, వన్నూరుస్వామి, సుంకన్న, నారాయణప్ప, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

# పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

**- పప్పుశెనగ కొనగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో తెలుగుదేశం నాయకులు**

ఉరవకొండ, మార్చి 14 ప్రభాతవార్త



పప్పుశెనగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మెన్ నరిశేటి విజయ భాస్కర్, ఉరవకొండ పీఏసీఎస్ ఛైర్మెన్ ప్యారం కేశవానంద, పెన్నహోబిళం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రేగటి నాగరాజు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం వారు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతోకలిసి ఏపీమార్క్‌ఫెడ్, యన్‌సి.సి.ఎఫ్ ఆధ్వర్యంలోఏర్పాటైన పప్పుశెనగ కొనగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పప్పుశెనగను కనీస మద్దతుధర క్వింటాల్ 5,875 రూపాయలతో కొనగోలు చేయడం జరుగుతుందన్నారు. త్వరలో నాఫెడ్ ద్వారా మరో కొనగోలు కేంద్రంకూడా ఇక్కడే ప్రారంభించడం జరుగుతుందన్నారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పంటను విక్రయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మోపిడి గోవిందు, యేళ్ల తిమ్మప్ప, యర్రగుంట్ల వెంకటేష్, ఎం.వరప్రసాద్, పి.నిరంజన్‌గౌడ్, ఆమిద్యాల రాజశేఖర్, బోయ రామాంజినేయులు, పాల గోవిందు, బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్టు...!

**రూ.27,500 నగదు, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం...!**

ధర్మవరం, మార్చి14, ప్రభాతవార్త



పేకాట రాయుళ్లను అరెస్టు చేస్తున్న టూటౌన్ సీఐ రెడ్డప్ప

ధర్మవరం మారుతీనగర్ లోని ఓ ఇంటిలో పేకాట ఆడుతున్న ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.27,500 నగదుతోపాటు ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. మారుతినగర్ లో ఓ ఇంటిలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో తాను తన సిబ్బందితో దాడులు చేసి ఆరుగురుని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.27,500 నగదు, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్టు సీఐ రెడ్డెప్ప తెలిపారు.

# మేకల మృతి బాధాకరం మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి రూరల్ మార్చి 14 ప్రభాతవార్త



బాధితులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి మండల పరిధిలోని వెంకట గారి పల్లి గ్రామంలో మేకలు మృతి చెందడం ఎంతో బాధాకరమని ఆ రైతుకు నష్టం వాటిని ఉందని అన్ని విధాల ఆదుకుంటామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. శనివారం వెంకట గారి పల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త హరిజన నరేష్ తండ్రి నాగప్ప కు చెందిన 15 మేకలు ఈనెల 12న గుళికల మందు చల్లిన గడ్డి తిని మృతి చెందాయి. తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న బాధిత నాగప్ప కుటుంబాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించి ఆదుకొని, ఓదార్చారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని వారికి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించి భరోసా ఇచ్చారు . ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వెంట వెంకట గారిపల్లి సర్పంచ్ లక్ష్మీదేవి,పుట్టపర్తి మండల నాయకులు సామకోటి ఆదినారాయణ, పుల్లప్ప, ఉపేంద్ర, ఓబులేసు, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ కొరత వదంతులు నమ్మొద్దు

**కళ్యాణదుర్గం ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రైటర్ తిప్పేస్వామి స్పష్టం**

కళ్యాణదుర్గం, మార్చి 14 ప్రభాతవార్త:

పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలో గ్యాస్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాల్లో ఎలాంటి నిజం లేదని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కళ్యాణదుర్గం ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రైటర్ తిప్పేస్వామి తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన గ్యాస్ సరఫరాపై నెలకొన్న అపోహలను ఖండించారు. గృహ వినియోగ (డొమెస్టిక్) గ్యాస్ సిలిండర్ల సరఫరా యథావిధిగా కొనసాగుతోందని, ఏజెన్సీ వద్ద తగినన్ని నిల్వలు ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం కేవలం కమర్షియల్ గ్యాస్ సరఫరాలో మాత్రమే స్వల్ప అంతరాయం ఏర్పడిందని, అది కూడా వారం రోజుల్లో పూర్తిగా సర్దుకుంటుందని వెల్లడించారు. గ్యాస్ బుకింగ్ సమయంలో ఓటీపీ (వీగిశ) రాకపోవడం లేదా కన్ఫర్మేషన్ మెసేజ్ ఆలస్యం కావడం సాంకేతిక కారణాల వల్లనే జరుగుతుందని తెలిపారు. దాన్ని గ్యాస్ కొరతగా భావించవద్దని వినియోగదారులను కోరారు. ఒకవేళ బుకింగ్ సమయంలో ఓటీపీ రాక ఇబ్బంది పడితే ఒకటి రెండు సార్లు ప్రయత్నించాలన్నారు. లేకపోతే నేరుగా గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని సంప్రదించి వివరాలు ఇచ్చి సిలిండర్ పొందవచ్చని సూచించారు. రాబోయే ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో గ్యాస్ దొరకదనే భయాలు అవసరం లేదని, నిరంతర సరఫరా కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా గ్యాస్ సరఫరాపై ప్రభావం పడుతుందనే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని తిప్పేస్వామి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అగ్ని ప్రమాదంలో దగ్ధమైన చింత చెట్లు

**రెండు లక్షల నష్టం ప్రభుత్వం ఆదుకోవాలి దళిత రైతు భాస్కర్**

బ్రహ్మసముద్రం 14 మార్చి ప్రభాతవార్త



అగ్నికి ఆహుత అయిన చింత చెట్లు దృశ్యం

మండల పరిధిలోని ఎస్ కోనాపురం గ్రామ సమీపంలో శనివారం మధ్యాహ్నం పంట పొలాలకు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రైతులు స్థానికులు అగ్ని ప్రమాదంలో అగ్నిజ్వాలలు పెద్ద ఎత్తున వ్యాపిస్తూ చింత మామిడి చెట్లు అగ్గి కి ఆహుతి అవుతుండగా అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇవ్వడంతో మంటలు అదుపు చేశారు. అనంతరం ఎస్ .కోనాపురం గ్రామానికి చెందిన దళిత రైతు భాస్కర్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 446 2ఏ 5 ఎకరాలు గల నా పొలం నందు చింత చెట్లు మంటల్లో కాలిపోయాయి రెండు లక్షల పైగా పెట్టుబడి పెట్టాము చేతికి వచ్చిన చింత చెట్లు దగ్గం అయిపోయాయి నాకు నిరాశ మిగిలింది. 450.చెట్లలో 160చెట్లు పూర్తిగా దగ్గ అయ్యాయని ఉద్యాన వన అధికారులు మాకు సకాలంలో నష్టపరహారం అందజేయాలని రైతు ఆవేదన చేశాడు.

# ఎస్ఎంఎ టైప్-2 వ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం

లేపాక్షి, మార్చి 14 ప్రభాతవార్త



ఆర్థిక సహాయం అందజేస్తున్న వీరభద్ర అన్నప్రసాద సేవా ట్రస్ట్

మండల కేంద్రమైన లేపాక్షికి చెందిన కేయాన్స్ అనే ఎనిమిది నెలల బాలుడికి ఎస్ఎంఈ టైప్-2 వ్యాధి సోకింది. దీంతో ఆ బాలుడు తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు లేపాక్షి వీరభద్ర అన్నప్రసాద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 10 వేల రూపాయలను ఆ చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నప్రసాద సేవా ట్రస్ట్ సభ్యులు రామాంజనేయులు, రాంప్రసాద్, వెచ్చం రవీంద్రనాథ్, అంజిరెడ్డి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.



20 వేల రూపాయలు అందజేస్తున్న ఎన్.బి.కె ఫ్యాన్స్

అదేవిధంగా ఎన్‌బికె అభిమాన సంఘం సభ్యులు కొండూరు సతీష్, ఎన్‌బికె మూర్తి, హనుమంత్‌రెడ్డి తదితరులు బాలుడి ఇంటికి వెళ్లి 20,500 రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ఆ బాలుడి వ్యాధి చికిత్స కోసం తమవంతుగా ఆర్థిక సహకారం అందజేశామన్నారు.

# పవన్ అంటే ఓ పవర్...100 శాతం స్ట్రైక్ రేట్ నిదర్శనం

**-గోరంట్లలో ఘనంగా జనసేన పార్టీ 13వ ఆవిర్భావ వేడుకలు**

**-మండల కన్వీనర్ సంతోష్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు, ద్విచక్రవాహన ర్యాలీ, కేక్ కటింగ్**

గోరంట్ల, మార్చి 14 ప్రభాతవార్త



జెండా ఆవిష్కరణ చేస్తున్న పార్టీ నేతలు

జనసేన పార్టీ ఆవిర్భవించి నేటికి 12 సంవత్సరాలు పూర్తి చేసుకొని 13వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా శనివారం గోరంట్ల మండల కేంద్రంలో మండల కన్వీనర్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి చిలమత్తూరి వెంకటేష్, జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు పాగుతోట వెంకటేష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నరేష్, సింగిల్ విండో డైరెక్టర్ నాగేష్, నియోజకవర్గ నాయకులు అనిల్‌కుమార్‌యాదవ్, వీరమహిళ కావేరి తదితరుల నేతృత్వంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గోరంట్ల పట్టణంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఆవరణలో ఉన్న జనసేన జెండా స్థూపం వద్ద జెండా ఆవిష్కరణ చేసి కేక్ కటింగ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాజంలో మార్పు కోసం బడుగు బలహీన వర్గాల కోసం జనసేన పార్టీని స్థాపించిన పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో ఎన్నో ఆటు పోట్లు ఎదుర్కొని ప్రజా సమస్యలకి పరిష్కారం చూపుతూ ప్రజల అభిమానాన్ని పొందుతూ 2024లో కూటమి విజయానికి ముఖ్యపాత్ర పోషించడమే కాకుండా దేశ చరిత్రలో ఏ పార్టీకి లేనంతగా 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించిన పార్టీగా జనసేన పార్టీ చరిత్ర సృష్టించిందన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఉపముఖ్యమంత్రిగా పవన్‌కళ్యాణ్ బాధ్యతలు తీసుకున్న తరువాత పంచాయతీరాజ్ శాఖ ద్వారా అనేక అభివృద్ధి పనులు, మారు మూల పల్లెలకు రోడ్లు పల్లెల్లో పల్లెబాట ద్వారా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీర మహిళలు శోభ, మండల నాయకులు రాఘవేంద్ర. శ్రీనివాసులు. రాజు. నాగేంద్ర. గాజుల రమేష్. తిరుపాల్. డల్లే నరేంద్ర. మొండి రామాంజి. మహేష్. పవర్ స్టార్ బాబా. బాలు. గోవిందప్ప. శంకర. రెడ్డెప్ప సురేష్. సింగిరెడ్డిపల్లి రమేష్. మంజు. హేమంత్. గణేష్. మధు. ఉపేంద్ర. మల్లి. చరణ్. మూర్తి. జస్వంత్. ప్రకాష్. వికాస్. నాగభూషణ. సాయి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# డాక్టర్ దేవిస్వామికి సత్కారం

**-లేపాక్షి సాంస్కృతిక కార్యక్రమాల్లో అభినందనలు**

గోరంట్ల, మార్చి 14 ప్రభాతవార్త



దేవిస్వామిని సత్కరిస్తున్న నిర్వాహకులు

వారసత్వ సంపదగా ప్రసిద్ధి చెందిన లేపాక్షిలో శనివారం వీరభద్ర అన్న ప్రసాదం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వీరభద్ర అన్న ప్రసాదం సేవా ట్రస్ట్ (లేపాక్షి) మరియు శ్రీమారెమ్మదేవి ట్రస్ట్,అండ్‌కల్చరల్‌ట్రస్ట్ (గుమ్మయ్యగారిపల్లి) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. బెంగళూరుకు చెందిన కళాకలవరం సంస్థ నృత్యకారులు పలు అంశాలపై నాట్య ప్రదర్శనలు ఇచ్చి సభికులను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా మహాగణపతి భరతనాట్యాన్ని నర్తకి విష్ణుప్రియ అద్భుతంగా ప్రదర్శించగా ప్రేక్షకులు ప్రశంసలు కురిపించారు. వివిధ సాంప్రదాయ నృత్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో మారెమ్మ దేవి సేవా ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ బి. దేవరాజ్, కళాకలవరం సంస్థ సభ్యులు డాక్టర్ నాగేంద్రనాథ్, వీరభద్ర అన్న ప్రసాదం సేవా ట్రస్ట్ సభ్యులు రామాంజనేయులు, రాంప్రసాద్, అంజనరెడ్డి, సాయినాథ్‌రెడ్డి, చరణ్‌కుమార్, గురిగిరెడ్డి, రవీంద్రనాథ్, వీరన్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులను నిర్వాహకులు అభినందించారు.

# గుత్తిలో లోక్‌అదాలత్ - 330 కేసులు పరిష్కారం

గుత్తి, మార్చి 14 ప్రభాతవార్త



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి సాధుబాబు, సీనియర్ సివిల్ జడ్జి విశ్వనాథచారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 330 కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ సందర్భంగా బాధితులకు ఒక కోటి 40 వేల రూపాయలను పరిహారంగా అందించారు. ఎంవిఐకి సంబంధించి 10 కేసులు, ఎక్సైజ్ 30 కేసులు, సివిల్ 10 కేసులు మినహా జరిమానా చెల్లించే కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శివకుమార్, గంగాధర్, శ్రీనివాసచారి, కోర్టు క్లర్క్ సాదిక్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

